క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహకారం



ఆశ్రమ నిర్వాహకుడికి నగదు అందజేస్తున్న దాత సత్యనారాయణ

చీపురుపల్లి: స్థానిక బాపూజీ వృద్ధాశ్రమం అభివృద్ధికి విజయనగరంలోని బాబామెట్టకు చెందిన ఆకుల సత్యనారాయణ రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. ఆదివారం ఆయన వృద్ధాశ్రమాన్ని సందర్శించి, ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు నగదు అంద జేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఆశ్రమ నిర్వహణ, అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

ఆలయం వద్ద తాగునీటి బోరు ఏర్పాటు



పూజలు చేసి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో నిర్మిస్తున్న శివాలయం వద్ద భక్తుల కోసం తాగునీటి బోరు ఏర్పాటు పనులను ఆదివారం చేపట్టారు. ఈపను లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తొత్తడి సత్తిబాబు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద హ్యాండ్ బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య రూ.1.35 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. పనులను జేసీఎస్ కన్వీనర్ పల్లి రఘు, మాజీ సర్పంచ్ లచ్చిరెడ్డి సూర్య నారాయణ,నాయకులు తొత్తడి చంద్రినాయుడు తదితరులు పర్యవేక్షించారు.

ఉచిత గ్యాస్ స్టవ్‌ల పంపిణీ



గ్యాస్‌స్టవ్‌లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేపాడ: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా మండలంలో 20 పేదకుటుంబాలకు మండల కేంద్రం లోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బీజేపీ నాయకులు ఉ చి తంగా గ్యాస్ సిలెండర్లు, స్టవ్‌లు ఆదివారం పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి థానేష్, ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్ యలమంచిలి ప్రసాద్, ఆపార్టీ మండ ల అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ మహిళలు కట్టెల పొయ్యిలపై వంట చేయడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనె క్షన్‌లు అందజేస్తోందని తెలిపారు. గ్యాస్ కూడా సబ్సిడీపై అందజేస్తోందన్నారు. వేపాడ ఏజెన్సీ నుంచి ఇప్పటివరకు 900 కనెక్షన్లు అందచేసినట్లు చెప్పారు. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు, తదితరులు

దత్తిరాజేరు: అన్నివర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్ని కల్లోనూ ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు కోరారు. మండలంలోని టి.భూర్జవలసలో 'మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి



శాఖా గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథం అధికారి శ్రీధర్ అన్నారు. గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులతో లైబ్రేరియన్ నీతి కథలు చదివించారు. అనంతరం క్యారమ్ బోర్డు, చదరంగం క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

- బీఎల్ఓలను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి



గంట్యాడ: కొరారుబిల్లి పోలింగ్ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ వెంకటేశ్వరావు



బొండపల్లి: ఎం.కొత్తవలసలో పోలింగ్ కేంద్రంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు



మెంటాడ(గజపతినగరం రూరల్): మరుపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణ



చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



జామి: లొట్లపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్



చీపురుపల్లిరూరల్(గరివిడి): కాపుశంబాంలో ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



వేపాడ: చినగుడిపాల పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్



జామి: కుమరాంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ వెంకటేశ్వరరావు

చీపురుపల్లి/ చీపురుపల్లిరూరల్(గరివిడి): పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించడంపై బీఎల్‌ఓలు దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలోని 136, 137, 138, 139,140 పోలింగ్ కేంద్రాలు, గరివిడి మండలంలోని కాపుశంబాం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన శిబిరాలను ఆమె పరిశీలించారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌ఓలను ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణించిన వారి పేర్లను పరిశీలించి, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేసిన తర్వాతే ఓటర్ల జాబితా నుంచి తొల గించాలన్నారు. ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వెళ్లి ఆ ఇంటిలో 18 ఏళ్లు నిండిన వారు ఉంటే ఓటరుగా నమోదు చేయాలని, ఈనెల9 నాటికి మొత్తం ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ బి.శాంతి, చీపురుపల్లి, గరివిడి తహసీల్దార్‌లు ఎం.సురేష్, టి.గోవింద్ తదితరులు ఉన్నారు.

నిష్పక్షపాతంగా చేపట్టాలి

గంట్యాడ: ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియ నిష్పక్షపాతంగా చేపట్టాలని గజపతినగరం ఓటరు నమోదు అధికారి వెంకటేశ్వరావు బీఎల్‌ఓలకు సూచించారు. కొఠారుబిల్లి, లక్కిడాం, రావివలస, కొర్లాం, మురపాక పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పి.నీలకంఠేశ్వరరెడ్డి ఉన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

గజపతినగరం/మెంటాడ(గజపతినగరం రూరల్): పద్దెనిమిదేళ్లు నిండిన వారంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అరుణ యువతకు సూచించారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని, మరుపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఆమె పరిశీలించారు. ఓటర్ల నమోదు, మార్పులకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌ఓలను ఆమె ఆరా తీశారు.

సందేహాలుంటే నివృత్తి చేయండి

బొండపల్లి: ఓటర్ల జాబితాల్లోని వివరాలపై ఎవరికైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని తహసీల్దార్ డి.జి.ఎం.ఎస్.ప్రసాదరావు బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని ఎం.కొత్తవలసతో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రా ల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన పరిశీలించారు. ఓటుహక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించి, 18 ఏళ్లు నిండిన వారందరితో ఓటు నమోదుకు దరఖాస్తు చేయించాలని సూచించారు.

151 దరఖాస్తుల స్వీకరణ

వేపాడ: మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో 151 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. తహసీల్దార్‌తో పాటు డీటీ సన్యాసినాయుడు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఫారం-6లు 91, ఫారం-7లు 34, ఫారం-8లు 31 అందాయని, అలాగే శనివారం నిర్వహించిన శిబిరాల్లో 117 దరఖాస్తులు అందాయి.

అర్హులందరినీ ఓటరుగా నమోదుచేయాలి

జామి: అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని ఈఆర్‌ఓ బి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ బీఎల్‌ఓలకు సూచించారు. లొట్లపల్లి, గొడికొమ్ము, పాత భీమసింగి, కుమరాం తదితర పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఈఆర్‌ఓ, తహసీల్దార్ పరిశీలించారు. ఓటర్ల నమోదు, చేర్పులు,బదిలీలు, సవరణలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జిల్లా వికలాంగ హక్కుల పోరాట కమిటీ సభ్యులు

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా వికలాంగ హక్కుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా వికలాంగ హక్కుల పోరాట కమిటీ సంఘ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కొవ్వాడ సత్యవతి, సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులహక్కుల కోసం తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. దివ్యాంగులు అంతా ఐక్యంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు రెడ్డి నీలకంఠం, పెనుమజ్జి రామకృష్ణ, శంకరరావు, లక్ష్మణరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరు



హర్షం వ్యక్తం చేస్తున్న గదబవలస గ్రామస్తులు

దత్తిరాజేరు: తమ గ్రామాలకు రహదారి కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని ఇన్నాళ్లూ ఎదురుచూసిన మండలంలోని గదబవలస, చినచామలాపల్లి గ్రామస్తులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తీపికబురు చెప్పారు. గదబవలస-చినచామలాపల్లి గ్రావెల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ రూ రల్ డెవలప్‌మెంట్ పథకం నుంచి రూ.2.20 కోట్లను ఎమ్మె ల్యే మంజూరు చేయించారు. దీంతో గదబవలస, చినచామలాపల్లి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ గత టీడీపీ ప్రభుత్వం లో నాయకులు, అధికారు ల చుట్టూ తిరిగి విసిగిపోయామని, ఎవరూ పట్టించుకోలేదని ఆయా గ్రామాలకు చెందిన పలువురు గుర్తుచేశారు. ఎట్టకేలకు తమ కలను వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం సాకారం చేస్తుండడం ఆనందంగా ఉందని గదబవలస మాజీ సర్పంచ్ లెంక సత్తిబాబుతో పాటు గ్రామస్తులు అన్నారు. ఇంగిలాపల్లి ఆంజనేయస్వామి కోవెల నుంచి చినచామలాపల్లి మీదుగా గదబవలసకు 5 కిలోమీటర్ల మేర త్వరలో తారురోడ్డును నిర్మించనున్నామని ప్రాజెక్ట్ జేఈ అప్పలనాయుడు ఆదివారం స్పష్టం చేశారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగించుకోండి



దేవుపల్లిలో అవగాహన కల్పిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు

బొండపల్లి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు సూచించారు. దేవుపల్లి గ్రామంలో చేతివృత్తులు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ఈ పథకంపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. 16 రకాల చేతివృత్తుల వారు ఈ పథకాని కి అర్హులని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం బ్యాంకు రుణాలు, ఆర్థిక సహాయం అందజేయనుందని చెప్పారు. అనంతరం పథకానికి ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. బీజేపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పి.గౌరి, నాయకురాలు మండపాక భారతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా చిన్న శ్రీను సోల్జర్స్



దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ సంఘ అధ్యక్షురాలు సిరి సహస్ర

విజయనగరం: అవయవలోపం ఉన్నా నేటి సమాజంలో అద్భుతాలు సృష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగులకు చిన్న శ్రీను సోల్జర్స్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సంఘ అధ్యక్షురాలు సిరిసహస్ర అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కణపాక యూత్ హాస్టల్‌లో స్పందన దివ్యాంగ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎంవీఎస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, దివ్యాంగులకు సేవలందిస్తున్న 15 స్వచ్ఛంద సేవా సంస్థలను గుర్తించి సత్కరించారు. అలాగే నైపుణ్యం కలిగిన 10 మంది దివ్యాంగులను సత్కరించి, మెమొంటోలు అందజేశారు. అనంతరం 100 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఎటువంటి సహాయం కావాల్సినా చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్పందన దివ్యాంగ సంస్థ అధ్యక్షుడు కందివలస సురేష్ , హ్యూమన్ రైట్స్ ప్రతినిధి సంతోష్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉప అధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, జగదీష్, శివ, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఏడు కోవెళ్లలో సహస్ర కలశాభిషేకం

విజయనగరం టౌన్: పట్టణంలోని బాబామెట్ట ఏడుకోవెళ్లలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం సహస్ర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ అభిషేకం వల్ల జాతకరీత్యా, గోచార రీత్యా కలిగిన శారీరక, మానసిక దోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. కార్య క్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శర్మ, సూర్యతేజ శర్మ, వినయ్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఏపీ రాజు, కార్యదర్శి పి.శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన సందడి



చీపురుపల్లి: కళింగ కోమటి సామాజికవర్గం కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బొండపల్లి: కొప్పలవెలమ సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధనలో పాల్గొన్న ఆ సామాజిక వర్గ మహిళలు



చీపురుపల్లి: కార్తీకవనసమారాధనలో పాల్గొన్న కళింగ కోమటి సామాజిక వర్గం మహిళలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): దేవాంగ సంఘం వన సమారాధనలో డ్యాన్స్ చేస్తూ సందడి చేస్తున్న మహిళలు



వేపాడ: కొండగుళ్లు వద్ద వనసమారాధనలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడును సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు



వేపాడ: వేపాడలో ఆదపురెడ్డి వారి కల్లాల వద్ద అన్నసమారాధన

బొండపల్లి: గజపతినగరం జోన్ కొప్పలవెలమ సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధన బొండపల్లిలోని జాతీయ రహదారి-26కు ఆనుకొని ఉన్న మామిడితోటలో ఆదివారం నిర్వహించా రు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన కొప్పలవెలమ కుటుంబాల వారు పాల్గొన్నారు. పిల్లలు, పెద్దలు అంతా ఆటపాటలతో సందడిగా గడిపారు. పిల్లలు, మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వ హించి విజేలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

దేవాంగ సంఘం ఆధ్వర్యంలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలానికి చెందిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ సంఘం కార్తీకవనమహోత్సవం గరివిడి పట్టణా నికి ఆనుకుని ఉన్న మామిడితోటలో ఆదివారం నిర్వహించారు. మహిళలు,చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు. అనంతరం వనభోజనా లు చేశారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, సర్పంచ్ పి.ప్రమీల, నాయకుడు బమ్మిడి అప్పలస్వా మి, ఆ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

వనసమారాధనలతో చక్కని సత్సంబంధాలు

చీపురుపల్లి: కార్తీక వనసమారాధానలతో చక్కని సత్సంబంధాలు ఏర్పడతాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని శివరాం రోడ్‌లో ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న తోటలో కళింగ కోమటి సామాజిక వర్గం కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్‌తో పాటు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంతో మనుషులు మధ్య దూరం పెరిగి సంబంధాలు కోల్పోతున్నామని అన్నారు. ఇలాంటి కార్తీక వనసమారాధనల ద్వారా అంతా ఒకే చోట చేరడం వల్ల చక్కని సంబంధాలు ఏర్పడతాయన్నారు. వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్థనరావు, నాయకుడు మంగళగిరి శ్రీను, కళింగ కోమటి సామాజిక వర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండగుళ్లులో..

వేపాడ: మండలంలో ప్రసిద్ధి చెందిన కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేపాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబాలు, వాసవీ క్లబ్ సభ్యులు హాజరై సహపంక్తి భోజనం చేశారు. అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడును ఆర్యవైశ్య సంఘం , వాసవీ క్లబ్ సభ్యులు సన్మానించారు.

వేపాడలో...

మండల కేంద్రానికి చెందిన ఆదపురెడ్డి కుటుంబీకులు గ్రామాన్ని ఆనుకుని ఉన్న మంచినీటి కోనేరు వద్ద ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. వేపాడ-వల్లంపూడి గ్రామాల ప్రజలు పాల్గొని కార్తీక దామోదరుని అన్నప్రసాదం స్వీకరించారు. డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడుతో పాటు వార్డు మెంబర్లు ముత్యాలునాయుడు, మిరపాక రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పి.వి.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. తుపాను నేపథ్యంలో వరి పంటను ఏవిధంగా రక్షించుకోవాలో తెలియజేశారు. కోతలు కోసిన వారు చేనును కుప్పలుగా పెట్టి వర్షానికి తడిసిపోకుండా టార్పాలిన్‌లతో కప్పాలని సూచించారు. పూర్తిగా ఎండిన వరి పంటను మాత్రమే దిబ్బలుగా పెట్టుకోవాలని చెప్పారు.

జోరుగా వరి నూర్పులు



కల్లంలో యంత్రం సహాయంతో వరి నూర్పు చేస్తున్న రైతులు

గుర్ల: తుపానుహెచ్చరికల నేపథ్యంలో మండలంలో కెల్ల, గుర్ల, గుజ్జింగివలస, కలవచర్ల, జమ్ము, వల్లాపురం, పకీరుకిట్టాలి గ్రామాల్లో రైతులు ఆదివారం వరి నూర్పులు చేశారు. సోమవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసి పొలాల్లో కుప్పలుగా పెట్టిన వారంతా చేనును ఆదరాబాదరగా కల్లాలకు తెచ్చి యంత్రాలతో నూర్పులు చేశారు.